RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 6 । ఆగస్టు । 2026

# మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

**కోనేరు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నాయకులు, అభిమానులు**





కొత్తగూడెం (తెలంగాణ వాణి)
మాజీ మంత్రి స్వర్గీయ కోనేరు నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ రూపురేఖలు మార్చడంలో కోనేరు నాగేశ్వరరావు పోషించిన పాత్రను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్ తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన కోనేరు అభిమానులు, శ్రేయోభిలాషులు, వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో సింగరేణి విద్యార్థినికి రెండు పథకాలు

**స్వర్ణ, రజత పతకాలు సాధించిన సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని భూక్య శ్రీవిద్య**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)
కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాలలో జూనియర్ సిఈసి. (ఇంగ్లీష్ మీడియం) చదువుతున్న కుమారి భూక్య శ్రీవిద్య పథకాలు సాధించింది. హైదరాబాద్‌లో 2026 ఆగస్టు 1, 2 తేదీలలో నిర్వహించిన 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్2026 లో భారతదేశం తరఫున పాల్గొని విశేష ప్రతిభ కనబరిచడం జరిగింది.కరాటే కాటా విభాగంలో స్వర్ణ పతకం, కరాటే కుమిటే విభాగంలో రజత పతకం సాధించి సింగరేణి సంస్థకు, సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల, కొత్తగూడెంకు విశిష్టమైన కీర్తి ప్రతిష్ఠలను తీసుకువచ్చింది. ఈ విజయం కళాశాలకు, సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా క్రీడలను ప్రోత్సహిస్తూ సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ (పర్సనల్), సెక్రటరీ జి. రాజేంద్ర ప్రసాద్, జాయింట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి. కాంతారావు, అలాగే కళాశాల ప్రిన్సిపాల్ టీ. సంధ్యారాణి, పిఈటి ఏ. లావణ్య విద్యార్థిని కుమారి భూక్య శ్రీ విద్యను ఘనంగా అభినందించారు. అలాగే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, సింగరేణి సంస్థకు, కళాశాలకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థిని సాధించిన విజయం పట్ల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలియజేశారు.

# 12వ వేతన ఒప్పంద పరిష్కారం కొరకు ఉద్యమిస్తాం

**- 10, సెప్టెంబర్ 12న జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)
12వ వేతన ఒప్పందంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 10వ తేదీ నుండి సెప్టెంబర్ 12వ తేదీ వరకు జరుగనున్న నిరసన కార్యక్రమాల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు పిలుపునిచ్చారు.బొగ్గు గని కార్మికుల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని దృష్టిలో పెట్టుకొని జాతీయస్థాయిలో నాలుగు జాతీయ సంఘాలు సిఐటియు, ఐఎన్టీయూసీ, ఎఐటియుసి, హెచ్ ఎం ఎస్ లు ఐక్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 10 నుండి సెప్టెంబర్ 12న బొగ్గు గని కార్మికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాలని అన్ని ప్రధాన కార్యాలయాలను ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని తీర్మానించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యజమాన్యం 12వ వేతన ఒప్పంద కమిటీని వేయటంలో జరుగుతున్న తీవ్ర జాప్యానికి నిరసనగా ఈ కార్యక్రమాలు బొగ్గు గని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందులో భాగంగా సింగరేణిలో కూడా ఈ కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం నిర్ణయించి కార్మికులకు సమాయత్తం చేస్తున్నట్లు నరసింహారావు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా బొగ్గు గని శాఖామంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి జోక్యం చేసుకొని 12వ వేతనం కమిటీని వెంటనే ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. లేనిపక్షంలో బొగ్గు గని కార్మికుల తీవ్ర నిరసన కార్యక్రమానికి పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన తెలియజేశారు. జాయింట్ గా ఇచ్చిన సదరు కార్యక్రమాలను సింగరేణిలోని కార్మికులందరూ విజయవంతం చేయటానికి సమయార్థం కావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

# రోజుకు 12 వేల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా సింగరేణి కార్యాచరణ



**- నైనీ గనిలో డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు, కోల్ మూవ్మెంట్ ఈడి బి వెంకన్న ఉన్నతస్థాయి సమీక్ష**

**- వినియోగదారులు, రవాణా ఏజెన్సీలు, జిల్లా కలెక్టర్ ఎం అబ్దుల్ అక్తర్, ఎస్పీ రాహుల్ జైన్ లతో కీలక సమావేశం**



కొత్తగూడెం, సింగరేణి ఆగస్టు 6 (తెలంగాణ వాణి):
ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి బొగ్గు రవాణాను లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేసేందుకు సింగరేణి ఉన్నతాధికారులు సమగ్ర కార్యాచరణ చేపట్టారు. ఈ మేరకు డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం నైనీ గని వద్ద ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో జిందాల్ స్టీల్, జిందాల్ ఇండియా పవర్ లిమిటెడ్, మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ ప్రతినిధులు, బొగ్గు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. నైనీ గని నుంచి ఏడాదికి 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఉండగా, సమీప విద్యుత్ కేంద్రాలతో పాటు తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం, తమిళనాడు జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు సకాలంలో బొగ్గు సరఫరా చేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.ప్రతిరోజూ కనీసం 12 వేల టన్నుల బొగ్గు రవాణా జరిగేలా రవాణా ఏజెన్సీలు, వినియోగదారులు సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ గౌతమ్ పోట్రు సూచించారు. రైలుమార్గం ద్వారా హిందోల్ రైల్వే సైడింగ్, కామాఖ్య నగర్ సైడింగ్ వరకు బొగ్గు రవాణా సజావుగా సాగేందుకు పూర్తి సహకారం అందించాలని ఈడీ బి. వెంకన్న కోరారు.ఈ సందర్భంగా బొగ్గు రవాణా మార్గంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించిన అధికారులు, అనంతరం అంగూల్ జిల్లా కలెక్టర్ ఎం. అబ్దుల్ అక్తర్, జిల్లా ఎస్పీ రాహుల్ జైన్‌లతో సమావేశమై రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాకు ప్రభుత్వ యంత్రాంగం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించారు.సమావేశానికి ముందు గౌతమ్ పోట్రు, బి. వెంకన్న నైనీ గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో నైనీ ఏరియా జనరల్ మేనేజర్ డి. బైద్యతో పాటు ఇతర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు అమలయ్యే వరకు పోరాటం



**టిబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ**

**ఓవర్‌మ్యాన్ నిరాహార దీక్షకు టిబీజీకేఎస్ మద్దతు**



కొత్తగూడెం, సింగరేణి (తెలంగాణ వాణి):
సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ బాధిత ఉద్యోగులు ఆగస్టు 5, 6, 7 తేదీల్లో కొత్తగూడెం ఎస్‌సీసీఎల్ హెడ్‌ఆఫీస్ ఎదుట చేపట్టనున్న మూడు రోజుల నిరాహార దీక్షకు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిబీజీకేఎస్) మద్దతు ప్రకటించింది.ఈ సందర్భంగా టిబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ, పలుమార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించినా, గుర్తింపు పొందిన కార్మిక సంఘం ద్వారా సమస్యను ప్రస్తావించినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. దీంతో బాధిత ఉద్యోగులు నిరాహార దీక్షకు దిగడం అనివార్యమైందన్నారు.సింగరేణిలోని అన్ని ఏరియాల మైనింగ్ స్టాఫ్, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాక్‌డేటెడ్ ఓవర్‌మ్యాన్ ప్రమోషన్లు అమలు అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాసరావు, ఇల్లందు ఉపాధ్యక్షుడు జాఫర్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, మైనింగ్ స్టాఫ్ నాయకులు మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు కె. విజయ్ కుమార్, బోరింగ్ శంకర్, గిన్నారపు మహిదర్, పీవీకే పిట్ సెక్రటరీ నేమిల వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ గొకాడ నవీన్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేష్ వినీత్, సీనియర్ నాయకులు ఎన్. శంకర్, తిరుపతి, దేవ్ సింగ్ నాయక్, అమరేందర్, గనిపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)
ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినులు సైబర్ మోసాలు, పరిస్థితుల్లో డిజిటల్ అరెస్ట్ లపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. స్టాక్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, లోన్ యాప్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల వినియోగం వంటి అంశాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తక్కువ సమయంలో అధిక లాభాలు, ఉద్యోగాలు, సినిమా అవకాశాలు, తక్కువ వడ్డీ రుణాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం లేదా ఓటీపీ వంటి గోప్యమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని విద్యార్థినులకు తెలిపారు. ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, కేవైసీ అప్‌డేట్‌లు, రివార్డులు లేదా లోన్‌ల పేరుతో వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, సైబర్ సెల్ అధికారులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఈద్గా, ఖబ్రస్తాన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈద్గా, ఖబ్రస్తాన్‌లో పరిశుభ్రత పనులు చేపట్టి, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి కమిషనర్‌కు వినతిపత్రం అందజేసింది. ఖబ్రస్తాన్‌కు వెళ్లే మార్గంలో పొదలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రి వేళల్లో వీధి దీపాలు లేక అంత్యక్రియలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ సుజాత, మేయర్ మూడ్ గణేష్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ కైరుల్లా ఖాన్, షేక్ బాబా, ఎం.డి. అర్మాన్ బక్ష్ తదితర ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఐఎఫ్టీయూ



కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):
హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఏసీఎల్ కార్యాలయానికి వినతిపత్రాలు అందజేశారు. హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ప్రమాద బీమా, వైద్య సదుపాయాలు కల్పించాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ - మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పందిర్లపల్లి వీరన్న, యాసారపు వెంకన్న,సహాయ కార్యదర్శి కొప్పుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మేకల వినోద్ నాయకులు బి.కిషన్,చేబోతు రవి, మెంతిని నాగేష్,బాల్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొదుమూరు సురేష్‌ను అభినందించిన ఎమ్మెల్యే

**- పట్టుశాలువాతో సత్కరించిన కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)
ఆర్యవైశ్య మహాసభ కొత్తగూడెం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కొదుమూరు సురేష్ బాబును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభినందించారు. బుధవారం పట్టణ మహాసభ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం సురేష్ బాబు తొలిసారిగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్యవైశ్య పట్టణ కమిటీ ముఖ్య నాయకులతో కలిసి వచ్చిన సురేష్‌ను ఎమ్మెల్యే కూనంనేని పట్టు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ మహాసభ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో పట్టణ మహాసభ గౌరవ అధ్యక్షులు దారా నగేష్, మహాసభ నాయకులు పల్లపోతు సాయిబాబు, పల్లపోతు వాసుదేవరావు(వాసు), వారణాసి సురేష్, చెల్లా శంకర్, గరిణి చిన్న, వాగు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల మహా పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన కొత్వాల




పాల్వంచ, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)
తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కళాకారులను ప్రజాప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం, సంక్షేమం, ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ, ఉద్యమ, కళాకారుడు కాంపెల్లి వంశీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామంలోని శ్రీ సీతారామాలయం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధి వరకు ఈ నెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర కళాకారుల మహా పాదయాత్రను చేపట్టారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్వంచలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ, కళాకారులకు ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకి రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఉద్యమ కళాకారులు కాంపెల్లి లక్ష్మణ్, కాంపెల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ ప్రారంభం

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రారంభం



**భద్రాచలం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల ప్రోత్సాహం, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎల్‌ఎంయూ) ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవజాత శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత కీలకమని, పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు అందించడంతో పాటు తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువులకు సంపూర్ణ పోషకాహారంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు.ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వై. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా. రవిబాబు, డీఎంహెచ్‌వో డా. తుకారం రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్‌వో డా. సైదులు, ఆర్ఎంవోలు, వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. వైద్యాధికారులు మాట్లాడుతూ, ఎల్‌ఎంయూ ద్వారా అకాలంగా జన్మించిన శిశువుల కోసం ముర్రు పాలను పరిశుభ్రంగా సేకరించి భద్రపరచడం, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై కౌన్సెలింగ్, పాలిచ్చే సరైన విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా తల్లిశిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగుపర్చనున్నట్లు తెలిపారు.

# ఈ నెలాఖరులోగా గోదావరి రెండో వంతెనపై రాకపోకల పునరుద్ధరణ : మంత్రి తుమ్మల



**భద్రాచలం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)**
గోదావరి వరదల కారణంగా దెబ్బతిన్న భద్రాచలం రెండో వంతెన అప్రోచ్ రోడ్డును ఈ నెలాఖరులోగా పూర్తిగా పునరుద్ధరించి, వంతెనపై రాకపోకలను ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మరమ్మతు పనులను పరిశీలించిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించి, నాణ్యతతో కూడిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.మంత్రి మాట్లాడుతూ, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దర్శనానికి దేశ విదేశాల నుంచి ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు వస్తారని, వారి సౌకర్యం కోసం రెండో వంతెన నిర్మించామని చెప్పారు. 2015 గోదావరి పుష్కరాల సమయంలో ఒకే వంతెన ఉండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వంతెన పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో వరదల వల్ల అప్రోచ్ రోడ్డుకు నష్టం కలగకుండా పటిష్టమైన రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ వంతెన మరింత సౌకర్యాన్ని కల్పిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్లాస్టరింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి

ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చివరి విడత ప్లాస్టరింగ్ ఖర్చుల కోసం ఇవ్వాల్సిన రూ.1.60 లక్షల నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. చర్ల మండలంలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన పేద కుటుంబాలు అప్పులు చేసి పనులు పూర్తి చేసుకున్నప్పటికీ, చివరి విడత నిధులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.అలాగే మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సహాయం వంటి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.ఒద్దిపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ ఏర్పాటు వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. భద్రాచలంచర్ల ప్రధాన రహదారి దుస్థితిని వెంటనే సరిచేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తాతారావు ప్రభుత్వాన్ని కోరారు.

# వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎకరానికి రూ.12 వేల పరిహారం ఇవ్వాలని ఏఐయుకేఎస్ డిమాండ్




**తల్లాడ, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కరుణాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐయుకేఎస్ వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో తగిన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.12 వేల నష్టపరిహారం చెల్లించాలని, రైతులను అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ మండల కార్యదర్శి కొండ వెంకటేశ్వర్లు, ఎస్కే జానీ, కుమారి, పుల్లమ్మ, వెంకులు, బాబు, లాల్మియా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు పీకే బ్లాక్ సింగరేణికే దక్కడం కార్మిక ఉద్యమ విజయమే: ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి మనుగడ కోసం మరిన్ని పోరాటాలు చేస్తాం

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు, పాస్‌పోర్టు కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి

బైపాస్‌కు రూ.500 కోట్లు.. సీతారామ ప్రాజెక్టు నీటితో మరింత ఆయకట్టు లక్ష్యం



**కొత్తగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
మణుగూరు పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం సిపిఐఏఐటీయూసీ చేపట్టిన ఉద్యమాల విజయమని, భవిష్యత్తులో సింగరేణి సంస్థ మనుగడ కోసం మరిన్ని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.బుధవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణుగూరు పీకే బ్లాక్ ప్రైవేటు సంస్థలకు కాకుండా సింగరేణికి దక్కేలా సిపిఐ, ఏఐటీయూసీ నిరంతర పోరాటం చేశాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఫలితంగానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్ కూడా సింగరేణికే దక్కడం కార్మికులకు శుభపరిణామమన్నారు.కొత్తగూడెం ప్రాంత అభివృద్ధికి ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందన్నారు.అదేవిధంగా రూ.10 కోట్లతో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అనుమతులు లభించాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరయ్యే అవకాశాలున్నాయని, కొత్తగూడెం బస్టాండ్ పునర్నిర్మాణంతో పాటు పాల్వంచ బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కొత్తగూడెం బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరయ్యాయని, పనులు పూర్తైతే పట్టణ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా మరింత ఆయకట్టుకు నీరందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తున్నామని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని కూనంనేని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఏఐటియూసి) ప్రధాన కార్యదర్శి కొరిమిరాజ్ కుమార్, వంగా వెంకట్ రమణమూర్తి వైవి రావు, జి వీరస్వామి, రత్నకుమారి, సందెబోయిన శ్రీనివాసరావు, ప్రశాంత్, జలీల్ పాషా, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు కొమారి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎస్పీ శుభాకాంక్షలు



ములుగు పోలీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కానిస్టేబుల్ గడ్డం క్రాంతి కుమార్ ఎన్నిక

నిజాయితీగా పారదర్శకంగా పనిచేయాలని ఎస్పీ పిలుపు

**ములుగు, ఆగస్టు5 (తెలంగాణ వాణి)**
జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు,ఉపాధ్యక్షులు,కార్యదర్శి,జాయింట్ సెక్రటరీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ,ట్రెజరర్,ఎగ్జిక్యూటివ్ మెంబర్ సభ్యులను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అనేది కేవలం ఒక సంఘం మాత్రమే కాకుండా, పోలీసుఅధికారులసంక్షేమం,పరస్పరసహకారం ,వృత్తిపరమైన అభివృద్ధి,సేవా నిబద్ధతను మరింత బలోపేతం చేసే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది, అధికారులు ఎదుర్కొనే సమస్యలను బాధ్యతాయుతంగా గుర్తించి ,వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా అసోసియేషన్ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ,జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తామని,పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా తమ వంతు బాధ్యతలను సమర్థవంతంగానిర్వర్తిస్తామని తెలిపారు.

# కొండచిలువ దాడిలో మహిళకు గాయాలు

గ్రామస్తుల అప్రమత్తతో తప్పిన ప్రాణహాని

**జనగామ, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం కంచనపల్లి గ్రామంలో మొక్కజొన్న చేనులో పని చేస్తున్న స్వప్న అనే మహిళపై సుమారు 12 అడుగుల పొడవున్న కొండచిలువ దాడి చేసింది. ఆమె కేకలు వేయడంతో గ్రామస్థులు వెంటనే స్పందించి కొండచిలువను అదుపులోకి తీసుకుని, గాయపడిన మహిళను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వెంటనే చికిత్స అందించడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. మహిళపై దాడి చేసిన కొండచిలువను కూడ ఆసుపత్రికి తీసుకుని రావడంతో దాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కాగా ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొనగా, అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# తుమ్మల పర్యటన విజయవంతం

మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ల ఉత్సాహం



**చర్ల, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్ల మండల పర్యటన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రికి ఘన స్వాగతం పలికిన వారు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. చర్ల మండల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు. ఈ సందర్భంగా చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, లక్ష్మీ కాలనీ సర్పంచ్ పూనెం లక్ష్మి, మొగాళ్లపల్లి సర్పంచ్ ఉప్ప సత్యవతి, మాజీ ఎంపీటీసీ మడకం పద్మ, కట్ట అమ్మాజీ, రాధా, మాణిక్యరావు లక్ష్మి తదితర మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు. మంత్రి పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మహిళా సాధికారతకు గ్రామసభలు దోహదం

- మహిళా సంఘాల గ్రామసభ ఘనంగా నిర్వహణ




**ఏటూరునాగారం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ఆధ్వర్యంలో మహిళా సంఘాల గ్రామసభ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, పొదుపు సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను సభలో వెల్లడించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత మాట్లాడుతూ, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే గ్రామాభివృద్ధికి బలమైన పునాదని అన్నారు. మహిళా సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం, తాగునీరు, పారిశుధ్యం, సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామసభలో మహిళలు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, గ్రామ కార్యదర్శి జనార్ధన్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం అంగన్వాడీల్లో నిర్లక్ష్యం..?

తాళం వేసి కనిపిస్తున్న కేంద్రాలు

పోషకాహారం అందక లబ్ధిదారుల ఇబ్బందులు

గ్రామ సభలో గ్రామస్తుల ఆగ్రహం..

సమగ్ర విచారణకు డిమాండ్




ఏటూరునాగారం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై గ్రామస్తులు, మహిళా సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సభలో అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందించాల్సిన పోషకాహారం సకాలంలో అందడం లేదని ఆరోపించారు.గ్రామస్తుల కథనం ప్రకారం, కొన్ని కేంద్రాలు తరచూ తాళం వేసి కనిపిస్తుండగా, మరికొన్ని చోట్ల టీచర్లు విధులకు హాజరుకాక ఆయాలు మాత్రమే కేంద్రాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒక కేంద్రంలో వారం రోజులుగా టీచర్ గైర్హాజరై ఉండగా, ఇద్దరు చిన్నారులతోనే కేంద్రం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన మాల సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ మాట్లాడుతూ, అనేక కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో లేరని, కొన్ని కేంద్రాలు పూర్తిగా మూసి ఉన్నాయని ఆరోపించారు. పాప్కాపురం అంగన్వాడీ కేంద్రంలో టీచర్, ఆయా లేకపోవడంతో కేంద్రం మూతపడినట్లు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.చిన్నారులకు వేడి భోజనం, గుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలు, అలాగే గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహారం సక్రమంగా పంపిణీ కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని, తనిఖీలు కూడా మొక్కుబడిగా జరుగుతున్నాయని ఆరోపించారు. తల్లిపాల వారోత్సవాలు వంటి కార్యక్రమాలు కూడా కేవలం ఫోటోలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు.గతంలో జరిగిన పదోన్నతులు, బదిలీల్లో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపించిన గ్రామస్తులు, జిల్లా యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం ప్రతిరోజూ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 6 । ఆగస్టు । 2026

# డ్రైనేజీ పూడికతీత పనులను స్వయంగా పర్యవేక్షించిన సర్పంచ్ బోడ బాలునాయక్

### గ్రామ పారిశుధ్యానికి ప్రాధాన్యం.. దోమల నివారణకు బ్లీచింగ్ పిచికారీ



**టేకులపల్లి, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ కాలువల పూడికతీత, శుభ్రపరిచే పనులను సర్పంచ్ బోడ బాలునాయక్ స్వయంగా పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి మురుగునీరు, వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సర్పంచ్, నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దోమల వ్యాప్తి నివారణ కోసం కాలువల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడ బాలునాయక్ మాట్లాడుతూ, గ్రామస్తుల ఆరోగ్య భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని, పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనంతల వసంత, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారుల సంక్షేమం కోసం 101 కి.మీ. పాదయాత్ర

### కాంపల్లి వంశీ ఆధ్వర్యంలో భద్రాచలం వరకు యాత్ర..

### కాంగ్రెస్ నాయకుల సంఘీభావం





**తల్లాడ, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఉద్యోగ భరోసా, సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కళాకారుడు, కేవీ కళాబృందం అధ్యక్షుడు కాంపల్లి వంశీ ఆధ్వర్యంలో తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామం నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం వరకు 101 కిలోమీటర్ల పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రను కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైడిపల్లి రవి, మండల అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మిరెడ్డి, జిల్లా నాయకుడు జక్కంపూడి కిషోర్ ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నిజమైన ఉద్యమ కళాకారులకు గతంలో తగిన గుర్తింపు, అవకాశాలు లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగ భరోసా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కళాకారులు చేసిన సేవలు మరువలేనివని, వారికి తగిన గౌరవం, ఉపాధి అవకాశాలు కల్పించాలని నాయకులు అన్నారు. కాంపల్లి వంశీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక కళా మండలి అధ్యక్షుడు గుడిపల్లి పుల్లారావు, తాళ్లపల్లి మనోజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జానకిరామ్, మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్ మోదుగు తిరుమల్‌రావు, ఉప సర్పంచ్ పైడిపల్లి జగన్, అంబేద్కర్‌నగర్ సర్పంచ్ మర్సకట్ల బాబురావు, కాంగ్రెస్ నాయకులు, పలు జిల్లాల ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.

# గ్రామీణ పారిశుద్ధ్య సేవల బలోపేతానికి కేంద్ర బృందం అధ్యయనం

### రెండు రోజుల పాటు ములుగు జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలన

### జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు



**ములుగు,ఆగస్టు5 (తెలంగాణ వాణి)**
గ్రామీణ పారిశుద్ధ్య సేవల బలోపేతానికి కేంద్ర బృందం ములుగు జిల్లాలోని చల్వాయి,మేడారం గ్రామాలలో రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తెలిపారు బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్ లో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కింద గ్రామీణ పారిశుద్ధ్య ఆస్తులు,సేవల నిర్వహణకు భవిష్యత్తులో అవసరమయ్యే నిధుల అంచనపై అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ బృందం, యూనిసెఫ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ఇటువంటి అధ్యయనాలు దోహద పడతాయని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధ్యయన నివేదికను సమర్పించాలని బృందాన్ని కోరారు. సంబంధిత శాఖల సమన్వయంతో అధ్యయన బృందానికి అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సహకారంతో ఈ అధ్యయనం నిర్వహించబడుతోంది. గ్రామీణ పారిశుద్ధ్య మౌలిక సదుపాయాల నిర్వహణ,నిర్వహణ వ్యయాలు,భవిష్యత్ నిధుల అవసరాలను అంచనా వేయడం ఈ అధ్యయనం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణ, అసోం, గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ అధ్యయనం చేపట్టనుండగా, తెలంగాణలో ములుగు, నారాయణపేట జిల్లాలను ఎంపిక చేశారు. ములుగు జిల్లాలో చల్వాయి, మేడారం గ్రామ పంచాయతీలను అధ్యయనం కోసం గుర్తించినట్లు తెలిపారు.

# లాస్య బుచ్చిపూడి రూరల్ హోప్ ఫౌండేషన్ ఔదార్యం



### - గిరిజన చిన్నారుల భవిష్యత్తుకు బ్రిడ్జ్ స్కూల్ బాట

**దుమ్ముగూడెం, ఆగస్టు 5 (తెలంగాణ వాణి)**
అడవుల మధ్య ఉన్న గిరిజన ఆవాసాల్లో నివసించే పిల్లలకు విద్య అందడం అనేది ఇంకా సవాలుగానే ఉంది. పాఠశాలలు దూరంగా ఉండటం, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపం కారణంగా అనేక మంది గిరిజన చిన్నారులు విద్యకు దూరమవుతున్నారు. అలాంటి పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇండిజినస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఐడీఓ) ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం గడ్డమడుగు గ్రామంలో బ్రిడ్జ్ స్కూల్ ప్రారంభమైంది. ఈ విద్యా కార్యక్రమానికి లాస్య బుచ్చిపూడి, రూరల్ హోప్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించడం విశేషం. గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సమాజంలో ఆత్మవిశ్వాసంతో ఎదిగే అవకాశాలను కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. బ్రిడ్జ్ స్కూల్ ప్రారంభోత్సవంలో డాక్టర్ రామి రెడ్డి, డాక్టర్ కపిల్ శర్మ, కుంజా రామారావు, గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో



తొలిసారిగా ఇలాంటి విద్యా కేంద్రం ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం సమాజానికి శుభపరిణామమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ బ్రిడ్జ్ స్కూల్ ద్వారా చదువుకు దూరమైన పిల్లలు తిరిగి విద్యా ప్రవాహంలోకి వచ్చి ఉన్నత లక్ష్యాలను సాధించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్డమడుగులో ప్రారంభమైన ఈ విద్యా కేంద్రం కేవలం ఒక పాఠశాలగా మాత్రమే కాకుండా గిరిజన చిన్నారుల బంగారు భవిష్యత్ కు బాటలు వేసే ఆశాకిరణంగా నిలుస్తుందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

# ఏన్కూర్ మండల కాంగ్రెస్ ఇన్‌చార్జిగా గోవిందు శ్రీనివాసరావు

### వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి



**తల్లాడ, ఆగస్టు 5 (తెలంగాణ వాణి):**
టీపీసీసీ ఆదేశాల మేరకు మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు కోసం ఏన్కూర్ మండల ఇన్‌చార్జిగా నియమితులైన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గోవిందు శ్రీనివాసరావును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏనుకూరు మండలంలో పార్టీ కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేయాలని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత గుర్తింపు కల్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని అన్నారు. గోవిందు శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి పనిచేస్తానని, కమిటీల ఏర్పాటులో పారదర్శకత పాటిస్తూ అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. తనను ఏన్కూర్ మండల ఇన్‌చార్జిగా నియమించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇండ్ల రంగ, ఏన్కూర్ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.